క్లుప్తంగా

సన్మానం



అబ్దుల్ గఫార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శిరివెళ్ల: మండల పరిధిలోని యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు అబ్దుల్ గఫార్, గౌసియా ఉశేన్‌బీని తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. వారికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

బోయ సంఘం కార్యదర్శిగా బాలహుసేన్

దొర్నిపాడు: దొర్నిపాడు మండల వాల్మీకి బోయ సంఘం కార్యదర్శిగా బాలహుసేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ వాల్మీకి బోయసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిక్రాంతి నాయుడు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు అర్జున్, ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటిని ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా బాలహేసేన్ తెలిపారు.

నంద్యాల సబ్ రిజిస్ట్రార్‌గా అబ్దుల్ సత్తార్



నంద్యాల(అర్బన్): నంద్యాల సబ్ రిజిస్ట్రార్–1గా అబ్దుల్ సత్తార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సునంద విజయవాడ ఐజీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ సత్తార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన అధికారిని స్టాంప్‌వెండర్లు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



సంత మార్కెట్‌ను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు

చాగలమర్రి: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం చాగలమర్రిలోని సంతమార్కెట్‌తోపాటు పరిసరాలను పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు శుభ్రం చేశారు. వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

లోక కల్యాణం కోసం హోమాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో వెలసిన శ్రీప్రథమనందీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం స్వామి వారికి ఉదయాన్నే మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి లక్ష్మి హోమం, రుద్రపాశుపత హోమం జరిపించి పుణ్యాహవచనం చేపట్టారు. ప్రథమనందీశ్వరస్వామి సేవా సమితి సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ రామానుజాచార్యులు, సుధాకర్, శంకర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

రుద్రవరం: మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు బదిలీ అయ్యారు. చిన్నకంబలూరు కార్యదర్శి కళావతి గడివేముల మండలం కరిమద్దెలకు, కోటకొండ కార్యదర్శి షాహినూర్ పెద్దకంబలూరుకు, నర్సాపురం కార్యదర్శి ప్రభాకర్ బనగానపల్లె మండలం యాగంటిపల్లెకు బదిలీ అయ్యారు. అదేవిధంగా చిత్రేనిపల్లె కార్యదర్శిని సంజామల మండలం నొస్సంకు, ఆర్.నాగులవరం కార్యదర్శి ఓబులేసు దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు, పెద్దకంలూరు కార్యదర్శి రాజశేఖర్ గోస్పాడు మండలానికి, ముత్తలూరు కార్యదర్శి గొళ్ల పాములేటి ఆలమూరుకు బదిలీ అయినట్లు మండల పరిషత్ అధికారలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నంద్యాల(అర్బన్): ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం మండలంలోని అయ్యలూరు మెట్ట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం – ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర 2047 పేరుతో పకడ్బందీ ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. అనంతరం అయ్యలూరు మెట్ట ప్రాంత నివాసి కొమ్ము రమణారెడ్డి వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.15వేల నగదు అందజేశారు. నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీఓ సుగుణశ్రీ పాల్గొన్నారు.

ముంచిన వర్షం!

- నీట మునిగిన పంటలు
- తడిసిన మొక్కజొన్న దిగుబడులు
- దెబ్బతింటున్న నాణ్యత
- కాపాడుకునేందుకు నానాపాట్లు
- నష్టానికి అమ్ముకోవాల్సిందే అంటున్న రైతులు



గొడిగనూరులో పశువుల పాకలో ఫ్యాన్ గాలికి మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతన్నలు

చాగలమర్రి: రైతన్నను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షం అన్నదాతలను నిండా ముంచింది. మండల కేంద్రం చాగలమర్రితోపాటు గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది. లోతట్టుకాలనీలు, రోడ్లు నీటమునిగాయి. తహసీల్దార్ కార్యాలయం జలమయమైంది. చాలా గ్రామాల్లో పంటపొలాల్లోకి వర్షపునీరు భారీగా చేరింది. గోడిగనూరు, ముత్యాలపాడు, డి.వనిపెంట తదితర గ్రామాలలోని కంది, పత్తి తదితర పైరులు నీట మునిగాయి. ఇక మొక్కజొన్న రైతులను వర్షం ఏకంగా ముంచేసింది. గతేడాది లాభాలు చేకూరడంతో మండలంలో ఈయేడు రైతులు మొక్కజొన్నను భారీగా సాగు చేశారు. ఎనిమిది వందల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు అయినట్లు అంచనా. దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉండడంతో మూడు వారాల కిందట రైతులు కోతలు మొదలు పెట్టారు. దాదాపు సగానికిపైగా కోతలు పూర్తయ్యాయి కూడా. కొందరు రైతులు ఇప్పటికే క్వింటాం రూ. నాణ్యత మేరకు రూ.2500 నుంచి రూ.2800 వరకు అమ్ముకున్నారు. అయితే రెండు రోజులుగా ధర మళ్లీ పడిపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కురిసిన వర్షాలు మొక్కజొన్నపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే నూర్పిడి చేసుకున్న మొక్కజొన్న దిగుబడులను తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడ్డారు. టార్పిన్‌లు కప్పినప్పటికీ మొక్కజొన్న దిగుబడులు తడిసిపోయాయని రైతులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర ప్రశ్నార్థకమే....

ఏడురోజుల కిందట మొక్కజొన్న క్వింటాం రూ.2500 నుంచి రూ.2800 ఉండగా ప్రస్తుతం రూ.2,200 నుంచి 2,500 వరకు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రత్యేకించి మొక్కజొన్నపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నూర్పిడి చేసుకున్న దిగుబడులు కొంతమేర తడిసిపోయాయి. దీంతో దిగుబడులను రైతులు ఫ్యాన్‌ల కింద ఆరబెట్టుకుంటున్నారు. ధర తగ్గడంతోపాటు తడిసిన మొక్కజొన్నకు ధర గిట్టుబాటు ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేదని వ్యాపారులు భారీగా కోత విధిస్తారని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరే గిట్టుబాటు కాదని, మళ్లీ కోతవిధిస్తే నష్టం తప్పదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు రైతులు.

కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం...

కౌలు రైతులు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కౌలురైతులు మొక్కజొన్నను ఎక్కువగా సాగు చేశారు. వేలకువేలు కౌలు చెల్లించిన రైతులకు గిట్టుబాటు ధర లభించకుంటే పూర్తి నష్టపోయే పరిస్థితి నెలకొంది. గోడిగనూరు గ్రామంలో కౌలు రైతు శ్రీరాములు ఏకంగా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. ఏకరానికి రూ.20 వేల ప్రకారం ఐదెకరాలకు రూ. లక్ష చెల్లించాడు. ఐదెకరాలకు సంబంధించి దాదాపు వంద క్వింటాళ్ల దిగుబడులు రావడంతో రోడ్డుపై ఆరబోశాడు. తార్పిన్‌లు కప్పినప్పటికీ దిగుబడులు కొంతమేర తడిసిపోయాయి. నాణ్యత సాకుచూపి ధర తగ్గిస్తే నా పరిస్థితి ఏమిటని కౌలురైతు శ్రీరాములు ఆందోళన చెందుతున్నాడు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పించాలని మొక్కజొన్న రైతులు కోరుతున్నారు.





కంది, పత్తి పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన ఇళ్లు– మన గౌరవం పథకంపై బుధవారం నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ నరసింహరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో, సొంత స్థలాల్లో మొత్తం 505 మందికి గత ప్రభుత్వంలో గృహాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహేంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వణితృష్ణ, పంచాయతీ కార్యర్శులు పాల్గొన్నారు.

సామూహిక తర్పణాలకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న మహాలయ అమావాస్యను పురస్కరించుకొని బ్రాహ్మణులకు ఉచిత సామూహిక తర్పణాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రావి నూతల దుర్గాప్రసాద్, కార్యదర్శి నగరడోన సుధీర్ తెలిపారు. వారు మాట్లాడుతూ వేదపండితులు వెంకటశేషఫణి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న బ్రాహ్మణ అపర కర్మల భవనంలో రెండవ తేదీన సామూహికంగా పితృదేవతలకు తర్పణం వదిలే కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 30వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్: 9182697844 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: జిల్లాలో నేరాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా సూచించారు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ అధికారులతో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. తీవ్ర నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా కోర్టుకు ఆధారాలు సమర్పించాలని చెప్పారు. మిస్సింగ్ కేసుల పరిష్కారానికి అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, బాలికలు, మహిళలపై నేరాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లోన్‌యాప్‌ల మోసాల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ, ప్రియతంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, యువరాజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నంద్యాల(రూరల్): పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం పట్టణంలోని తెలుగుపేట, బైరమల్‌స్ట్రీట్ ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలను శుభ్రపరిచి, చెత్తను తరలించిన తరువాత బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. కొందరు సిబ్బంది అధికారులు, ప్రజాప్రతినిధులు వార్డు పర్యటనలకు వస్తున్నారని కాల్వలను శుభ్రపరచకుండా కేవలం బ్లీచింగ్ పౌడర్ మాత్రమే చల్లడం పద్ధతి కాదన్నారు. నందమూరినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందుకు మంత్రి ఫరూక్, ఎంపీ శబరి, కలెక్టర్ రాజకుమారి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమీషనర్, హెల్త్ అధికారి డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ అధికారి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

పటిష్టంగా ఉచిత ఇసుక సరఫరా

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనులు భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు వివరించారు. బుధవారం సాయంత్రం విజయవాడ గనులు భూగర్భ శాఖ కార్యాలయం నుంచి జిల్లాల్లో అమలవుతున్న ఉచిత ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్లతో గనులు భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయాలు.. జిల్లాల్లో పాటించాల్సిన చర్యలను వివరించారు. ఇందులో భాగంగా ఇసుక పంపకాలు, ఐవీఆర్ఎస్ రిపోర్టు స్టేటస్, జీఎస్టీ తదితర అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అలాగే జిల్లాస్థాయి ఇసుక కమిటీ, రవాణాదారుల మధ్య సేవాస్థాయి ఒప్పందం అంశం, రవాణాదారుల పనితీరు, చెల్లింపులో మినహాయింపులు, రవాణా ఖర్చులను వివరించారు. రవాణా దారుల నమోదు, పోర్టల్‌లో సమ్మతిని అందించిన తర్వాతనే ట్రిప్పులు కేటాయించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, మైనింగ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఖాదరబాద్ నర్సింగరావు మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం ఉమ్మడి జిల్లాల అండర్–14, 17 బాల బాలికల త్రోబాల్, ఫెన్సింగ్, టెన్నికాయింట్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మయ్య ప్రారంభించారు. నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. గెలుపొందిన క్రీడాకారులు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, రవికుమార్, ప్రతాప్, వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాణెమ్మ, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చెత్త కుప్పను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చెత్త తొలగింపు



మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పేరుకుపోయిన చెత్త (ఫైల్)

నంద్యాల(రూరల్): పట్టణంలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా.. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 20న కార్యక్రమం నిర్వహించి ఫోటోలకు ఫోజులిచ్చి మమ అనిపించారు. అయితే కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్త కుప్పలపై 21వ తేదీన సాక్షి దినపత్రికలో 'పడకేసిన పారిశుద్ధ్యం శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో నాలుగు రోజులకు మున్సిపల్ సిబ్బంది మేల్కొని బుధవారం మున్సిపల్ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

ఈఓఆర్డీ బదిలీ

శిరివెళ్ల: మహానంది మండలానికి ఈఓఆర్డీ నాగేంద్ర బదిలీయయ్యారు. ఆయన స్థానంలో రుద్రవరం ఈఓఆర్డీ శ్రీనివాసాచారిని ఉన్నతాధికారులు నియమించారు. అలాగే స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అశ్వనికుమార్ నియమితులయ్యారు.

పూర్వ విద్యార్థుల విరాళం

గోస్పాడు: యాళ్లూరు ఉన్నత పాఠశాలలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌కు విరాళం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శివ నాగేంద్రుడుకు బుధవారం పూర్వ విద్యార్థులు పుల్లయ్య, భూమరాజు సురేష్ శర్మ వారి సంఘం తరపున రూ. 5వేలు అందజేశారు.

పార్కింగ్ స్థలానికి వేలం

నంద్యాల(రూరల్): పట్టణంలోని గాంధీ చౌక్‌లోనున్న పెద్ద మార్కెట్‌లోని పార్కింగ్ స్థలానికి వేలం పాట నిర్వహించారు. బుధవారం నిర్వహించిన వేలంలో జాకీర్ హుసేన్ రూ.58,500కు దక్కించుకున్నట్లు మున్సిపల్ అసిస్టెంట్ ఇన్‌చార్జి కమిషనర్ అంకిరెడ్డి తెలిపారు. కాగా.. మార్కెట్ వేలం వాయిదా వేశామని ఆయన తెలిపారు. మార్కెట్ వేలంలో దాదాపు 20 మంది పాల్గొనగా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వాయిదా వేశారని సమాచారం.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

గోస్పాడు: రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు సురేష్, చెన్నయ్య డిమాండ్ చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా అన్నదాత సుఖీభవ మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికే వర్షాల వల్ల పంటలు దెబ్బ తినడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు గుర్తింపు కార్డులు ఇస్తున్నామని చెబుతున్నా.. పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. మార్క్, కరీముల్లా, శ్రీనివాస్‌రెడ్డి,పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): పోస్ట్ మెట్రిక్ మైనార్టీ బాలుర వసతి గృహంలో చేరేందుకు ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న నంద్యాల జిల్లాలోని మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ జాకీర్‌హుసేన్ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న హాస్టల్‌లో చేరే విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్ హాస్టల్‌ను తనిఖీ చేయగా వసతులు కల్పించాలంటూ విద్యార్థులు వినతి పత్రం అందజేశారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలు 3 -12 సంవత్సరాల్లోపు పిల్లలకు నిర్వహిస్తున్నట్లు ఖురానిక్ స్టడీస్ కన్వీనర్ జక్రియ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, జిల్లా ఐటా అధ్యక్షుడు అఫీజ్ మహమ్మద్, సోయాబ్ జమా మాట్లాడుతూ పదవ రాష్ట్రస్థాయి ఖురాన్ కంఠస్థ పోటీల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ : 8555989159 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నవంబర్ 2 నుంచి త్రోబాల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నవంబర్ 2, 3, 4 తేదీల్లో గురురాజ క్రీడా మైదానంలో త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని విద్యాసంస్థల డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి, ఏపీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. బుధవారం పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పాణ్యం ఎంఈఓ సుబ్రహమణ్యం, సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రవికుమార్,



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నంద్యాల(అర్బన్): వ్యవసాయ రంగంలోశాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధన ఫలితాలు రైతులకు చేరవేసినప్పుడే పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధిస్తారని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. మండలంలోని పులిమద్ది, భీమవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయం, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు 20 కేజీల పొటాష్ వేస్తే మొక్కల్లో రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా గింజ బరువు పెరుగుతుందన్నారు. ఎండు తెగులు నివారణకు నత్రజని ఎరువులు వాడవద్దని, పొలంలో నీటిని తీసివేసి పొలాన్ని ఆరబెట్టాలన్నారు. ఏఓ ప్రసాదరావు , ఏఈఓ మణిమోహన్‌రెడ్డి, పులిమద్ది గ్రామ సర్పంచ్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిని సద్వినియోగం చేసుకోవాలి

మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయ సంయుక్త సంచాలకులు కృపాదాస్ తెలిపారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన రైతులను రైతు ఉత్పత్తి దారుల సంఘంతో ఒప్పందం చేయించాలని సూచించారు. ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలలో రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. డీఏఓ మురళీకృష్ణ, ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు, ఏఈఓ రవికుమార్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

ఉయ్యాలవాడ: రసాయన ఎరువులు అధికంగా వాడడం మూలంగా పంటలు విషతుల్యమవుతాయని, తగ్గించాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పడిగపాడు, నర్సిపల్లె గ్రామాల్లో రైతులతో కలిసి పొలం పొలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రైతు భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వినియోగించుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలు సమయంలో తప్పని సరిగా రసీదులు పొందాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ ఉమామహేశ్వరమ్మ

దొర్నిపాడు: పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని ఏఓ సునీత సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె కౌలుగుర్తింపు, భూసార పరీక్షల కార్డులను రైతులకు అందజేశారు. సూక్ష్మపోషకాలను గుర్తించి భూసారం పెంచేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పుల్లయ్య, వీఏఏలు వంశీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని ఆర్‌డీకేలో బుధవారం ముత్యాలపాడు, తోడేండ్లపల్లె గ్రామాల రైతులకు ఏఓ రంగనేతాజీ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఆధునిక పద్ధతులు పాటించి, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. వరి, మొక్కజొన్న, మినుము తదితర పంటలను ఆశించు పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తను వివరించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయిబాబా, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

చాగలమర్రి: ఉపాధి పథకం కింద పది అంశాల పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ కోవెలకుంట్ల క్లస్టర్ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. చాగలమర్రిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పని దినాలు, హార్టికల్చర్ పంటల సాగుకు భూముల గుర్తింపు, ఫారం పాండ్స్ ఏర్పాటు, ప్లాంటేషన్, రేయిన్‌వాటర్ తదితర అంశాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ క్రింద కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని 8 మండలాలలో ఉద్యాన పంటల సాగుకు 730 ఏకరాల మేరకు రైతులను గుర్తించాలని ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటి వరకు 550 ఏకరాలకు సంబంధించి రైతులను గుర్తించామన్నారు. అనంతరం మండలంలోని శెట్టివీడు, ముత్యాలపాడు గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద సాగు చేసిన మల్లెతోటలను ఏపీడీ సాంబశివరావు పరిశీలించారు.

'ఇది మంచి ప్రభుత్వం'లో మహిళకు అస్వస్థత



అస్వస్థతకు గురైన మహిళను మోసుకొస్తున్న యువకుడు

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం అధికారులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకే సమావేశం ఉందని, 8.30 గంటలకే మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని అధికారులు పొదుపు మహిళలను ఆదేశించారు. అయితే సమావేశం ఆలస్యం కావడంతో రుద్రవరానికి చెందిన ఓ మహిళ ఉన్నట్టుండి అస్వస్థతతో కుర్చీలో నుంచి కింద పడింది. ఆమెను పలకరించిన స్పందన లేక పోవడంతో ఓ యువకుడు సమావేశ భవనంలో నుంచి ఆమెను బయటకు తీసుకు వచ్చి భర్తకు సమాచారం అందించారు. ఆయన రాగానే అస్వస్థతకు గురైన మహిళను మోటార్ సైకిల్‌పై వైద్య శాలకు తరలించారు. అక్కడ చికిత్సలు అందించాక ఆమె కోలుకుందని చెప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అయితే సమావేశానికి ఎమ్మెల్యే ఆలస్యంగా రావడం వల్లనే ఆమె నీరసించి అస్వస్థకు గురైందని మహిళలు చర్చించుకున్నారు.